క్లుప్తంగా

వర్షాలు కురవాలని పూజలు



కాడికి కప్పలను కట్టి ఊరేగిస్తున్న చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సీజన్ మొదలై నెల రోజులు కావొస్తున్నా సమృద్ధిగా వర్షాలు కురవడం లేదని గ్రామస్తులు, చిన్నారులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో కప్పతల్లికి నీళ్ల పోసి అభిషేకాలు చేశారు. అలాగే కప్పలను కాడికి కట్టి చిన్నారులచే పుర వీధుల్లో ఊరేగించారు. అదే విధంగా గ్రామంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు కురవాలని పంటలు పండాలని మొక్కుకున్నారు. ఈ విధంగా చేస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం.

సెల్ ఫోన్ అప్పగింత

భద్రాచలంఅర్బన్: బస్సులో ఒక మహిళా ప్రయాణికురాలు తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకోగా.. డ్యూటీలో ఉన్న ఆర్టీసీ కండక్టర్ దానిని గుర్తించి తిరిగి అప్పగించాడు. సోమవారం చర్ల వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న ఒక మహిళా ప్రయాణికురాలు తన రూ.11 వేల విలువైన సెల్ ఫోన్‌ను పొరపాటున పోగొట్టుకుంది. బస్సులో డ్యూటీలో ఉన్న కండక్టర్ కృష్ణవేణికి ఆ ఫోన్ దొరికింది. ఆమె ఫోన్‌ను స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు అప్పజెప్పారు. ఆ విచారణ చేపట్టి ఆ ఫోన్ తేగడ గ్రామస్తురాలు మంగవేణిదిగా గుర్తించారు. వెంటనే ఆమెకు సమాచారం అందించి ఫోన్‌ను తిరిగి అప్పగించారు. తన పోయిన ఫోన్ తిరిగి రావడంతో మంగవేణి సంతోషం వ్యక్తం చేస్తూ కండక్టర్ కృష్ణవేణికి, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పైరవీకారులను నియంత్రించాలి

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలను దోచుకుంటున్న పైరవీకారులను ఉన్నతాధికారులు నియంత్రించాలని సీపీఐ(ఎంఎల్) డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలకు నేరుగా అందాల్సిన పౌరసేవలకు కొందరు పైరవీకారులు మధ్యవర్తులుగా వ్యవహరించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల కొత్త రేషన్‌కార్డుల కోసం ఒక్కొక్కరి వద్ద రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూళ్లకు పాల్పడి అనర్హులకు కూడా రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కొందరు పేదల నుంచి వేలరూపాయలు వసూలు చేశారని ఆరోపించారు.

రాజీవ్ యువ వికాసానికి ఎదురుచూపులు

అశ్వాపురం: రాజీవ్ యువవికాసం పథకం కోసం మండలంలో సుమారు రెండు వేల మంది నిరుపేద నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు చేయూత అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయకుండా తుంగలో తొక్కిందన్నారు. వెంటనే అమలు చేయని పక్షంలో స్థానిక ఎన్నికల్లో యువత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో అశ్వాపురం మాజీ ఉపసర్పంచ్ భూక్యా చందూలాల్, మామిడాల శివయ్య, కాలువ సంసోన్, మేకల భాస్కర్, మురికిపూడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరుటౌన్: జీఓ నంబర్ 282ను రద్దు, పనిగంటల పెంపు, కనీస వేతనంగా 26వేలు చెల్లింపు తదితరడిమాండ్ల సాధన కోసం ఈ నెల 31న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హాస్పటల్ వర్కర్లతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని రంగాల కార్మికులపై దృష్టి పెట్టాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఖర్గే జన్మదిన వేడుకలు

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ నాయకులతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.శివసైదులు, కూరపాటి సౌజన్య, సిరియాల చైతన్య, రామ్‌రెడ్డి, కుర్రం రవి, గాండ్ల సురేష్, మానస, సాంబ, సుబ్రహ్మణ్యం, రహీం పాషా, సీతయ్య, ముత్తయ్య, కృష్ణ, త్రిమూర్తి, నర్సింహ, అప్పారావు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆగని వసూళ్ల పర్వం

- చేతివాటం ప్రదర్శిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్
- ఒక్కో ఇసుక, బొగ్గు లారీ నుంచి రూ.100 డిమాండ్
- నష్టపోతున్న రాజుపేటవాసులు.. మిన్నంటుతున్న నిరసనలు



రూ.100 వసూలు చేసిన రశీదు



లారీలను నిలిపివేసి ఆందోళన చేస్తున్న రాజుపేట గ్రామస్తులు(ఫైల్)

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామస్తులు ఇప్పటికే బొగ్గు లారీలు, ఇసుక లారీల రవాణాతో విసిగి వేసారిపోతున్నారు. కొత్తగా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట ఇసుక, బొగ్గు లారీలు నడుతున్న ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.100 చొప్పున వసూళ్లు చేస్తున్న అంశం మరింత కలవరపాటుకు గురి చేస్తోంది.

సమస్య ఇది..

మణుగూరు ఏరియా బొగ్గు లారీలతోపాటు ఇసుక లారీలు రాజుపేట మీదగా రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్ద వాహనాలు నిత్యం రవాణాను సాగిస్తుండడంతో దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. ఇది రాజుపేట వాసులపై తీవ్ర ప్రభావితం చూపుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ అభివృద్ధి కోసం లారీల వారు కొంత నగదును సహకారంగా అందించేవారు. అయితే ప్రస్తుతం లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు ఆ కాస్త నగదును లారీల నుంచి తమ ఖాతాలో వేసుకుంటున్నారు. రాజుపేట అభివృద్ధి కోసమంటూ ఒక్కో లారీ నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. దీంతో లారీల మూలంగా అన్ని రకాలుగా నష్టపోతోంది గ్రామస్తులైతే.. వారికి అందాల్సిన నగదు మాత్రం లారీ ఓనర్ల జేబుల్లోకి వెళ్లినట్టైంది. ఈ పరిణామం ఇప్పటికే పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ గ్రామస్తులకు మరింత తలనొప్పిని తెచ్చిపెట్టింది. దీంతో లారీ ఓనర్ల అసోసియేషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించనివారు వసూళ్లకు ఎలా తెరలేపుతారని ప్రశ్నిస్తున్నారు. అసోసియేషన్‌కు సహకరిస్తున్న కొందరు ఇసుక సొసైటీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలు..

ఇదే విషయంపై గత రెండు రోజుల క్రితం గ్రామస్తులకు, లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే గ్రామస్తులు ఇసుక, బొగ్గు లారీలను సైతం నిలిపివేసి ఆందోళన చేపట్టారు. సింగరేణి అధికారుల హామీతో బొగ్గు లారీల రవాణాకు లైన్ క్లియర్ అవ్వగా.. ఇసుక లారీలకు సంబంధించిన సమస్య మాత్రం అలానే మిగిలిపోయింది. లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇసుక లారీల వద్ద నుంచి విరాళం వసూళ్లను మాత్రం ఆపకుండా కొనసాగిస్తున్నారు. ఈ వసూళ్ల పర్వం ఇలాగే కొనసాగితే జరగబోయే పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



కొత్త దంతనం పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తెల్లం..

దుమ్ముగూడెం: మండలంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. చిన్న బండి రేవు, లక్ష్మీనగరం గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న వాటర్ ట్యాంకుల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అలాగే కొత్త దంతనం, లచ్చిగూడెం, కోయ నర్సాపురంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కోయనర్సాపురం గ్రామంలో ఓ నాయకుడి ఇంటి దగ్గర జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పర్యటనలో ఎంపీఓ బద్ది రామకృష్ణ, సీఐ అశోక్, ఎస్ఐ గణేష్, ఏఓ నవీన్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ మండల నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారాయణమూర్తి, మట్టా శివాజీ, తోటమల్ల సుధాకర్‌రావు, ముర్రం వీరభద్రం, కుంజా శ్రీనివాసరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారికి శంకుస్థాపన

చర్ల: అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. చర్లలోని బస్టాండ్ సెంటర్‌లో రూ.1.11కోట్ల నిధులతో చేపట్టనున్న రహదారి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చర్ల బస్టాండ్ సెంటర్ నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి ఎన్నో ఏళ్లుగా నిరాధరణకు గురైందని, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సమస్యను తన దృష్టికి తీసుకురాగా దీని నిర్మాణానికి నిధులు కేటాయించామని తెలిపారు. అనంతరం మండలంలోని చిన్నమిడిసిలేరులో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్, ఎంపీడీఓ ఈరయ్య, ఏఈలు వాసు, ఉపేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, చీమకుర్తి వీరభద్రం, బండారు రామకృష్ణ, జవ్వాది రవి, ఇర్రంకి ఉదయ ప్రభాకర్ పాల్గొన్నారు.

దీక్ష విరమింపజేసిన డీఎం

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతూ గత 20 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న స్థానికులకు, సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్టాండ్‌లో బస్సుల రాకపోకలకు అడ్డుగానున్న పెట్రోల్ బంక్ గోడను తొలగిస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు వెళ్లే షటిల్ సర్వీసులను కూడా దమ్మపేట బస్టాండ్‌కు వచ్చేలా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సున్నం శ్రీను, తంబళ్ల రవి, వలీ, పాశం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులకు నిమ్మరసం ఇస్తున్న సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

అజోల్లాతో ప్రయోజనాలు



రైతు పొలంలో అజోల్లా చల్లుతున్న అధికారులు, రైతులు

మణుగూరుటౌన్: మండలంలోని రైతులు అజోల్లాను వినియోగించడం వల్ల విశేషమైన ఫలితాలు పొందవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మణ్ అన్నారు.

సోమవారం మండలంలోని ఉడతనేని గుంపులో రైతులను పొలాలను సందర్శించి అజోల్లాను బయోఫెర్టిలైజర్, పశుగ్రాసం, నీటి నాణ్యత మెరుగదల వంటి వివిధ ప్రయోజనాలకు వినియోగిస్తారన్నారు. వరి పొలాల్లో నేల సారాన్ని పెంచడానికి విలువైనదిగా పనిచేస్తుందన్నారు. అజోల్లా పశువుల, కోళ్లకు పోషకమైన మేతగా అందించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉడతనేని కోటేశ్వరరావు, శ్రీను, అజయ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సాయిబాబాకు మకరతోరణం బహూకరణ

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో కొలువుదీరిన శ్రీసాయి బాబాకు భద్రాచలం పట్టణవాసీ దాసి యుగంధర్–చైతన్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు సరస్వతి, రెయాన్స్, రుహికలు రూ.25వేలు విలువ చేసి ఇత్తడి మకరతోరణాన్ని బహూకరించారు. దానిని సోమవారం ఆలయ అర్చకులు వి.సంతోష్ పవన్ కుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గుమస్తా బండారు వెంకన్న పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి అందజేస్తున్న దాతలు

ఇసుక ట్రాక్టర్ సీజ్

గుండాల: కిన్నెరసాని నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్సై సైదా రహూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయనపల్లి ప్రాంతం కిన్నెరసాని వాగు నుంచి ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సమాచారం మేరకు ఎస్సై మండల కేంద్రంలో పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మంత్రి పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నేడు (మంగళవారం) పర్యటించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదలైంది. మండలంలోని లింగాలపల్లి, రామచంద్రాపురం, నాగుపల్లి, గుండెపట్వారిగూడెం, తాటిసుబ్బన్నగూడెం, చలమప్పగూడెం తదితర గ్రామాల్లో పలు బీటీ రోడ్లను ప్రారంభించిన అనంతరం పట్వారిగూడెం రైతు వేదికలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

న్యాయం చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు కణితి చిన్నమ్మికి చెందిన 12 ఎకరాల భూమిని అక్రమంగా ఇతరులు పట్టా చేసుకున్నారని, దానిని రద్దు చేసి వృద్ధురాలికి న్యాయం చేయాలని ప్రజాపంథా మాస్‌లైన్ మండల కార్యదర్శి సాయన్న, ఏపీఎస్‌పీ జిల్లా జాయింట్ సెక్రటర్ సోందె మల్లుదు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలనాపాలనా చూసుకునే వారి లేని కణితి చిన్నమ్మి భూమిని ఆమెకు తెలియకుండా బంధువులు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయంపై గత 5 ఏళ్లగా కార్యాలయాల చుట్టూ వృద్ధురాలు తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నారు. తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ఆలయంలో మొక్కలు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. హరితహారంలో భాగంగా ప్రాంగణమంతా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామారావు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుక

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని రాజాపురం గ్రామంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని సోమవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహిళలు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మేనకోడలు కుర్సం వెంకటరమణ ఇటీవల మృతి చెందగా.. సోమవారం వారి నివాసంలో మృతురాలి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలతో నివాళులర్పించారు. తన అక్క బావలను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బంధువులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వీధులు మునక



మణుగూరుటౌన్: గాంధీనగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు

మణుగూరుటౌన్: మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో మండలంలోని పలు పంచాయతీల్లో రోడ్లు నీటిమయమయ్యాయి. గాంధీనగర్‌లోని ఓ ఇంట్లోకి వరద నీరు చేరి సామగ్రి మొత్తం తడిచిపోయాయి. రామానుజవరంలో ప్రధాన రహదారి కల్వర్టు పూడుకుపోవడంతో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించి చెరువును తలపించింది.

డ్రెయినేజీ బ్లాకేజీతో అవస్థ..

మున్సిపాలిటీలో సోమవారం మధ్యాహ్నం 45 నిమిషాలు కురిసిన వర్షానికే ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ సమీపంలో భారీగా నీరు నిండిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సైడ్ డ్రెయిన్‌లో సాఫీగా నీరు పారకపోవడం వల్లే సాధారణ వర్షానికి సైతం రోడ్లపై భారీగా నీరు నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. వానాకాలం దృష్టిలో పెట్టుకుని డ్రెయినేజీలో పూడుకుపోయిన చెత్తా చెదారాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

'స్థానికం'లో సత్తా చాటాలి



ములకలపల్లి: మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పొడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండాలని, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో రాబోయ్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక భగవాన్ దాస్ కాలనీలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పథకాలను ప్రచార హస్తంగా వినియోగించుకుని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. తద్వారా ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేయడానికి ప్రతి కార్యకర్తా శక్తివంచన కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మ, మండల అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు, త్రినాథరావు, జల్లారపు శ్రీనివాస్, సతీష్, నాగబాబు, కేశవ్, రామమోహన్‌రావు, సుబ్బారావు, సత్యనారాయణ, చక్రవర్తి, వెంకటేశ్వర్లు, వెంకన్న, ఉపేందర్, వెంకటసుబ్బారావు, నిఖిల్, నాగమణి, సమీరా తదితర పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన ఆటో కార్మికులు

మణుగూరుటౌన్: ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని సీపీఐ నేత అయోధ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆటో యూనియన్ మణుగూరు సురక్షాబస్టాండ్ అడ్డా, సమ్మక్కసారక్క టాటా మ్యాజిక్, బయ్యారం, జానంపేట, పినపాక అడ్డాలకు సంబంధించిన ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో కార్మికులు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల తాము రోడ్డున పడ్డామని, రోజుకు రూ.200 కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు అయోధ్య కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు అండగా ఉంటామని, ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. సమావేశంలో నాయకులు కిర్ల ప్రసాద్, లాలు, తిప్పర్తి వీరాచారి, సిరిగద్దె సతీష్, భాస్కర్, రామకృష్ణ, అశోక్, లింగమల్లు, సాధిక్‌లు, సీపీఐ నాయకులు సుధాకర్, జక్కుల రాజబాబు, రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, సీతారాములు ఉన్నారు.

తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఆ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక క్యాంప్ ఆఫీసు వద్ద మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామ నాయకులు, గ్రామస్తులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారంవారిగూడెం కాలనీలో బీఆర్ఎస్ పార్టీ వారే మరలా బీఆర్ఎస్ పార్టీలో చేరారని, కానీ కాంగ్రెస్ పార్టీ వారు చేరినట్లు అవాస్తవాలు చెప్పి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వాటిని మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నంద్రు రమేష్, గేదల సురేష్, నారం కృష్ణ పాల్గొన్నారు.

పచ్చని మొక్కలపై వేటు

- మోడుగా మారిన 'ఉపాధి' మొక్కలు
- రూ.9.5 లక్షల నిధులు వృథా

ములకలపల్లి: రూ.9 లక్షలకుపైగా వెచ్చించి నాటిన మొక్కలు నేలమట్టమవుతున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్లు విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్నాయని కొందరు వ్యక్తులు వాటిని నరికేశారు. వెరసి హరితం కాస్తా హ(ఖ)తమౌతోంది.

విద్యుత్ తీగలకు అడ్డురావడంతో..

ములకలపల్లి మండలం చౌటిగూడెం జీపీ పరిధిలోని కంపగూడెం రోడ్డు నుంచి కొత్తబ్రిడ్జి వరకూ ఉపాధి హామీ పథకంలో 9.42 లక్షల ఖర్చుతో మొక్కలు నాటారు. రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి, మొక్కలుగా ఎదిగాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా.. విద్యుత్ లైన్ల కింద మొక్కలు వేయడంతో ఇప్పడవి పెరిగి, విద్యుత్ తీగెలకు తగులుతున్నాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇటీవల కొందరు రైతులను ఆమొక్కలను నరికేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెపుతున్నారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించాలని ఆయా శాఖ ఉన్నతాధికారులు స్పష్టంగా ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఇక్కడి మొక్కలను మాత్రం మొదటికంటా ఇష్టారీతిన నరికేయడం గమనార్హం, దీంతో పచ్చటి మొక్కలు కాస్తా మోడుగా మిగిలాయి. అసలు సంబంధిత శాఖఅధికారుల పర్యవేక్షణ లేకుండా చెట్లు ఎలా నరుకుతారనేది ప్రధాన ప్రశ్న.

ఆ లైన్లకింద ఎందుకు నాటినట్లు?

మొక్కలు నాటడం ఎందుకు? వాటిని నరకడం ఎందుకని ప్రకృతి ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. నాటిన మొక్కల లెక్కల కోసం ఇలా విద్యుత్ లైన్ల కింద వేసి, చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎదిగిన మొక్కల నేపథ్యంలో, నాటే రోజునే ఆపేస్తే ఈ పరిస్థితి ఏర్పడేది కాదంటున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి, సాకిన చెట్లు అర్థాంతరంగా నేలరాలడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కల పెంపకం పేరిట ప్రజాధనం దుర్వినియోగం పట్ల దృష్టి సారించలని సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.





విద్యుత్ లైన్ల కింద మొక్కలు నరికేయడంతో మిగిలిన మోడులు